# ఆజ్ కల్ కీ కహానీ...



వీరాజీ

ఫోన్ మోగింది .... వార్తలు వింటూ గెడ్డంగీసుకుంటున్న ప్రకాశం విసుగ్గా మొహం చిట్లించి – వంటయింటికేసి క్రీగంట చూశాడు! ....కాఫీ పొయ్యిమీద నుంచి దింపుతున్న శారదమ్మ భర్త ఫోన్ అందుకునే స్థితిలోలేడని గ్రహించి – గబగబావచ్చి ఫోనెత్తి – "ఎవరు కావాలండీ?" అంది. "ఎడిటరు ప్రకాశం గారున్నారా అమ్మా?" చాలా వినయంగా వుంది అవతలి కంఠం....

"ఒక్క నిమిషం...." అని ఫోన్ మూతిమీద అరచెయ్యి దొప్పలాచేసి అడ్డం పెట్టి "మిమ్మల్నే అడుగుతున్నాడు...." అంది భర్తకు వినపడేలాగ.... వార్తలు వినలేకపోతున్నానన్న దుఃఖం – రేజర్ తగిలి బుగ్గమీద తెగిందన్నబాధ మిళితంకాగా – "పేరుచెప్పి చావమను ...." అన్నాడు ఎడిటరు ప్రకాశం.... ....

పేరడిగింది....జాగ్రత్తగా వింది.... "చెప్పినా తెలియదుటండీ .... వారితో ఒక్కసారి మాటాడాలి".... అంటున్నాడండీ ఎవడో గడుసు పిండంలాగున్నాడు" అంది, యిటువంటి సంభాషణలకి అలవాటుపడ్డ ఎడిటరు భార్య శారదమ్మ.

తుండుతో గెడ్డం వొత్తుకుంటూ "నేనే .... ప్రకాశాన్ని .... ఎవరు" అన్నాడు. ఫోనందుకుని. ఏ మాత్రం కుతుహలం లేకుండా వంటయింటిలోకి వెళ్లిపోయింది శారదమ్మ.

"నమస్కారమయ్యా.... కాకినాడ నుంచి వచ్చానయ్యా నేను....కాకినాడలో తమరి స్నేహితులున్నారు కదండీ.... వెంకటేశ్వర్రావు పొంతులుగారూ...."

"వెంకటేశ్వర్రావా? వెంకట్రావా?"

ఆఁ.... ఆఁ.... అదేనయ్యా! వెంకట్రావుగారేనయ్యా! తమరి షడ్రకుడు కదండీ–" అన్నది అతలి కంఠం కొంచెం తొట్రుపడుతూ....

"—సర్లే .... షడ్రకుడుకాడు నా బొందకాడు.... మా యావిడ మేనత్త కొడుకుగాని....అసలు విషయం చెప్పు" అన్నాడు ప్రకాశం తన సహజ నిర్లక్ష్య ధోరణిలో.

"చింతపం డంపించారండీ"....

"చింతపండా?.... ఆయన కెక్కడిదీ?"

చింతపండు అన్నమాట భర్తనోట వినంగానే – కుతుహలంతో వంటయింటి నుంచి శారదమ్మ పప్పుగరిట అట్టే పట్టుకుని వచ్చేసింది.

అవతలివాడి కంఠం కొంచెం బలం పుంజుకుంది. "కర్రబ్బాయో, యెర్రబ్బాయో వున్నారు కదటండీ మీ ఫ్రెండు .... ఆయన అంపించమని యిచ్చేరుటండీ" ....

వోహో.... అని గుర్తుపట్టినట్లు అని అవతలవాడి మాట వింటూనే ఫోన్ మూతిమూసి– "మన కరస్పాండెంటు ఎర్ర సూర్యం యిచ్చుంటాడ్లే...." అని భార్యతో అని మళ్ళీ "ఎట్లా తెచ్చావు? ఎక్కడ్నుంచి మాట్లాడుతున్నావు? నా ఫోన్ నెంబరు ఎట్లా తెలిసింది? చీటీ ఏమైనా యిచ్చాడా?" — జర్నలిస్టు ధోరణి ప్రశ్నలు వేశాడు– యిప్పుడు నిర్లక్ష్యం పోయింది ప్రకాశం కంఠంలో....చింతపండా? మరొకటా?! బజార్లో పిక్కతీసీ తియ్యంది కిలో పదిరూపాయలు.... అక్కడెక్కడో ఏజెన్సీ ప్రాంతంనుంచి చవగ్గా వస్తుంది సార్! మాకు ఓ పాతిక బుట్టలు పంపిస్తానన్నాడు కరస్పాడెంట్ ఎర్ర సూర్యం ఆ మధ్య వోసారి వచ్చినపుడు– అప్పుడే –పైకం యివ్వనా?" అన్నాడు ఎడిటర్ ప్రకాశం.

"భలేవారే! అప్పుడిద్దురు లెండి.... మావాడొహడు లారీవాడున్నాడు .... వాడేవో సరుకు లేసుకుని యిటుకేసి వచ్చేటప్పుడు గప్‌చిప్‌న దాన్లో ఏసేస్తే అదే వచ్చేస్తుంది" అన్నాడు సూర్యం....

అదంతా క్షణమాత్రం విపుల దృశ్యంగా మనో నేత్రం ముందు రూపుకట్టగా ప్రకాశం ఆశపడ్డాడు.

“మా సరుకుల్లారీ వస్తాంది గదండి దాన్లో అడేసుకు వస్తున్నారండీ....”

“వాహో .... ఎక్కడుందేమిటా లారీ ?”

“ఈపాటికి పటమట గోడౌన్‌కు చేరిందండీ! అక్కడ అన్‌లోడింగ్ ఉందండీ !”

“మరి మా యిల్లు యివతల కొస నుండే.... ఎట్లా తెస్తావ్ ? ఎంత.... ఓ అరక్వీటాలుంటుందా ?”

“తెలవదండి.... ఓ వదిహేను యిరవై బుట్ట లుండొచ్చండి.... మీ ఆఫీసుకి తెచ్చేద్దారా ?”_ ప్రేమగా అడిగాడు....

“ఎట్లా తెస్తావ్ ?.... మా యింటికి తేరాదూ ?”

అవతలివాడు నీళ్ళుకారిపోయినట్టు_ “కుదర్దండి .... సెంటర్లో వుంది మీ ఆఫీసు_ అక్కడ దింపేసి _ మళ్ళీ మేం లోడేసుకుని_ కాకినాడకి లారీ యీపూటే లాగించేస్తామండీ_”

“సరే.... ఆసుఫీకురా.... చూద్దాం....” ఫోన్ పెట్టేశాడు ప్రకాశం....

అవునూ ! వీడికి ఫోన్ నెంబరెవ రిచ్చారబ్బా....? అన్నాడు బాత్రూముకి దారితీస్తూ.

“మా వెంకట్రావ్ యివ్వకూడదా ? మీ ఏజెంటు నల్లసూర్యం లేకపోతే.... చింతపండిచ్చి పంపిన ఎర్రసూర్యం_ ఎవరో వొకరు యివ్వొచ్చుగా.... ఆ ధర్మసందేహం ఎందుకు గాని .... చవగ్గా వస్తున్నదా ? లేకపోతే కాశీ నుంచి గాడిదగుడ్డూ అన్నట్లు_ బజారు రేటుకే అంటగడతాడా ?” అంది శారదమ్మ.

“చూద్దాం ! పర్సులో ఓ వందో, వందపాతికో పైకం బీరువాలోది తీసి పెట్టు.... ఎందుకేనా మంచిది.... రెండు మూడు రూపాయలకన్నా ఎక్కువ రేట యితే పంపదులే మనవాడు....” అన్నాడు బాత్రూమ్ తలుపు మూసేసుకుంటూ ప్రకాశం_

ఎప్పుడేనా యిట్లా యిటు వచ్చే లారీలమీద సీజన్‌లో మామిడి పండ్లు పంపేయడం కద్దు_ కాకినాడవాళ్ళు_ అందుకే ప్రకాశం అంత ఆలోచన, ఆందోళన లేకుండా_ తాపీగా మామూలుగా ఆఫీసుకు వెళ్ళాడు.

* * *

టపా చూస్తున్నాడు.... ఫోన్‌లు మ్రోగుతున్నాయి. మామూలు హడావుడి మధ్య_కాకీనిక్కరు, తెల్లాచొక్కా_ మాసిన గెడ్డాం బాపతు మనిషి వచ్చాడు. ఎవరన్నట్లు చూశాడు ప్రకాశం తల ఎత్తి.

“చింతపండు ....” అన్నాడు తన పేరుతో పనిలేదన్నట్లు ఆ మాసిన మనిషి.

“తెచ్చావా ?.... ఎంతిమ్మన్నాడు మీవాడు ? అసలు ఎంతుంది ?” అన్నాడు.

తొంభై రెండు రూపాయల పదారు పైసలవుద్దటండీ _”

“అబ్బా ! అంత ఖచ్చితంగా వుందా లెక్క ! ఎన్ని కిలోలేం ?”

“బుట్టలెక్క కదండీ ! వో వలభై యాభై కిలోలవుద్దేమో.... కాస్త తొందరగా వుంది. మళ్ళ ట్రిప్పు ఏసుకొవి పోవాల....” అన్నాడు. యింత అనుమానప్పినుగవి ఎక్కడా చూడలేదు అన్నట్లు ప్రకాశాన్ని చూసి అవతలి మనిషి.... తొట్రుపాటులేదు. తొందరపాటు తప్ప_ “దిట్టంగా వున్నాడు వీడి దుంపదెగ” అనుకొని పొరుగు లాగి,పర్సు అందుకుంటూ “సరుకు బైట దించావా? గేటు లోపలా?_” అడిగాడు_

“ఏమోనండీ.”

“అరి నీ యిల్లు బంగారంగానూ ! మరి పైకం యెట్లా యిమ్మన్నా ?”

“మరి సరుకు పటమటలో అన్‌లోడ్ అయిపోద్దండీ.... తమరే అక్కడ నుంచి ఏర్పాటు చేసుకోవాల.... మరి మీరు వుదయం సొమ్ములాడేసుంటే యీ పాటికి బుట్టలు మీ గేట్లో పారేసి పోదుమండీ_”

ప్రకాశం వందరూపాయల కాయితం తీశాడు పర్సులోంచి.... అట్టే పట్టుకున్నాడు. వీడెవడో ముక్కూ మొహం ఎరుగని శాల్తీ .... వీడికి వంద రూపాయల కాయితం యిస్తే తిరిగివస్తాడో .. అది పట్టుకుని వుడాయిస్తాడో ?....

“మా సరుకుని మేమే తెచ్చుకోవాలన్నమాట ?” అడిగాడు మాటలకి వెతుక్కుంటున్నట్లు మొహంపెట్టి.

ఆ మనిషి దృష్టి ప్రకాశం పట్టుకున్న నూర్రూపాయల కాయితం మీదే వుంది.

“క్రింద ఆటో వుందండీ ! దానిలో నేను నేరుగా మా లారీకాడికే పోతున్నానండీ .... మీరోపాలొస్తే యిద్దరం కలిసేపోదారి.... అక్కడ మీరు సరుకు తీసుకుని .. ”

“సరి.... సరి.... నేను ఎక్కడ రాగలను మనిషిని పంపిస్తాను.... సరుకు యిచ్చేసెయ్.... పైకం మాత్రం తీసుకుపోయి మా ఎర్రసూర్యానికియ్య....” అన్నాడు.

“ఎదవది పైకం యేవుంది లెండి.... మీ సరుకు మీ కప్పగించాల.... సైము లేక గానండీ.... మీ యింటికాడ దింపవలసిన మాటండి....” అంటూ ఆ పెద్దమనిషి తొందరపడ్డాడు.

ప్రకాశం తన దగ్గర వుండే గుమస్తాని పిలిచి, వంద రూపాయలిచ్చి_ విషయం అంతా క్లుప్తంగా చెప్పి పంపించాడు.

“ఆటోవాడు_ క్రింద మండిపోతున్నాడు.... కారాలు మిరియాలు నూరు

తున్నాడు.... పోదాం పద.... నేరుగా అక్కడికే...." అంటూ ఆ పెద్దమనిషి గుమస్తా గుర్రాజును కూడా ఆటోలో కూచోపెట్టుకుని "రైట్ రైట్" అన్నాడు.

ఆటో నాలుగు సందులు తిరిగి ఒక చిన్నకార్ల షెడ్ దగ్గిర ఆగింది....

చింతపండు పెద్దమనిషి దిగాడు....

"యిప్పుడే వస్తాను సార్!" అంటూ ఆటో డ్రైవర్ని కూడా తీసుకుని వెళ్ళాడు.



గుర్నాధం వందరూపాయల కాయితం జేబులో వుంటే పొరపాటున బైటపడి పోతుందేమో నన్నట్లు చేత్తోనే తీసి, గట్టిగా పట్టుకున్నాడు- చింతపండు తను కూడా ఓ అయిదారు కిలోలు ప్రకాశాన్ని అడిగి సంపాయించుకోవాలి- మహా అవస్థగా వుంది-" అనుకుంటున్నాడు. పుల్ల పుల్లగా చింతపండుగురించి ఆలోచించు కుంటున్నాడు,

ఆటోడ్రైవర్ తిరిగి వచ్చాడు.... "సార్! ఆయన లోపలున్నారు.... మీరు వందరూపాయల కాయితం యిస్తారు పట్రమ్మన్నాడు...." అన్నాడు. కార్ల షెడ్‌బయట బెత్తు కుర్చీలలో ముగ్గురు కూచున్నారు. మధ్య గుండ్రని బల్లమీద టెలిఫోన్ ఒకటి పడివుంది.

గుర్నాధం ఆ ముగ్గురికేసి చూస్తూ- "యివ్వమన్నారా!" అన్నాడు....

అంతలో ఆ లోపల్నుంచి, ఆ పెద్దమనిషివస్తూ "యివ్వండయ్యా" అని కేక వేశాడు. ఆ ముగ్గురూ తలలు పంకించారు.

గుర్నాధం నూర్రూపాయల నోటుని కొంచెం సంకోచంగానే, ఆటోడ్రైవర్ చేతిలో పెట్టాడు.

"చింతపండు" గుర్నాధం వేపు వీపు పెట్టి, ఆ పెద్దమనుషుల దగ్గర్నుంచి కొన్ని నోట్లు అందుకుని, యిటు తిరిగి, అవి లెక్కపెట్టుకుని, జేబులో పెట్టు కుంటూ వచ్చి "సార్! మీ పని అయి పోయిందండీ!" అన్నాడు.

గుర్నాధం గుండె ఝల్లుమంది. పచ్చనోటు తీసుకుని, చింతపండు ఇవ్వకుండానే- "పని అయిపోయిదండీ" అంటాడే వీడు.

"మరి సరుకు?" అడిగాడు ధైర్యం తెచ్చుకుని.

"బందరు రోడ్డుమీద అన్‌లోడింగ్‌లో వుంది.... ఏ. పి. కె. 420.... అక్కడికి ఆటోలోనే వెళ్ళండి.... దీనికి మీరు ఛార్జీలు కూడా యివ్వొద్దు.... మరి నాకేమో పార్సిలు అసుఫీలో అర్జెంటు పనుంది. పోయిరండి.... వెళ్ళవయ్యా, గురూ!" ఆటోకి రైట్ చెప్పేశాడు.

ఆటో దొర్లుకుంటూ బందరురోడ్డు మీద బెంజికంపెనీ ప్రక్క రోడ్డులోకి వెళ్ళి ఆగింది.

గుర్నాధం అటూయిటూ చూశాడు. దూరంగా వో గొడౌన్‌లాంటి దాని ముందు ఏ. పి. కె. 420 ఆగివుంది. ప్రాణం లేచివచ్చింది.

"అదే లారీ! పద.... సరుకు వేసుకుని తిరిగి పోదాం...." అన్నాడు గుర్నాథం గమ్యంచేరిన ఉత్సాహంలో హుషారుగా.

లాభంలేదు గురూ! ఆయనెవడో తెల్లారిన కాణ్ణుంచీ చంపేశాడు....పది రూపాయలు చేతిలో పెట్టాడు .... యిక్కడవరకే బేరం.... నేను పటమట లంకలోపలికెళ్ళాలి .... యింకోబండి చూసుకోండి .... అంటూ" గుర్నాధాన్ని దింపి, గిరుక్కున ఆటో తిప్పుకున్నాడు. అది దొర్లుకుంటూ మెయిన్ రోడ్డు ఎక్కేసింది.

గుర్నాధం లారీదగ్గిరకి వెళ్ళాడు.... సరుకు అన్‌లోడింగ్ కాదు ....లోడింగ్ జరుగుతోంది. బస్తాలు.... ఘాటైన నీరుల్లిపాయల వాసనలు వేస్తోంది .... కూలీలెవ్వరూ గుర్నాధం మాటలు వినేలాగలేరు.

డ్రైవరు సీటువేపు కెళ్ళాడు గుర్నాధం. డ్రైవరు సగం తలుపు తెరచి పట్టుకుని, దానిమీద ఓకాలు పడేసి తాపీగా చుట్ట కాల్చుకుంటున్నాడు.

"ఏమయ్యో! డ్రైవరుగారూ!" గుర్నాధం మూడుసార్లు పిలిచేనే గాని ఆ డ్రైవరు "వూఁ" అనలేదు!

చింతపండు "తీసుకెళ్దామని వచ్చాను అన్నాడు గుర్నాధం.

"తీసుకుపోసామీ.... నా పర్మిషన్ యెందుకూ?"

"ఎక్కడుందీ?"

డ్రైవర్‌కి చిర్రెత్తింది–"ఎవరయ్యా నువ్వు? సింతపండెక్కడుందో నాకేటి తెలుసుద్ది? యిసిగించబాక.... వెళ్ళిరా బాబూ! నీకో దండం" అంటూ చుట్ట పారేసి, తుపుక్కున వూశాడు!

గుర్నాధానికి దుఃఖం ముంచుకొచ్చింది! బాబ్బాబూ! డ్రైవరూ"అంటూ డ్రైవరికి కథంతా చెప్పాడు.

డ్రైవరంతా విని నవ్వాడు.... "వో హో హా.... అవిపగలబడి నవ్వేడు.

"విన్ను కేటుగాదెవడో ముంచేశాడు గురూ....తిన్నగా పోలీసుస్టేషన్‌కి ఎళ్లు ....లేదా తూరుపుతిరిగి దండం పెట్టు...." అంటూ "ఎంతసేపయ్యా సాములూ లోడింగ్ .... ఐపైపోయింది .... నా బైముకి నేను బండి లాగించేత్తా గ్యారంటీ .... అంటూ" బండి వెనక్కెళ్లాడు.

"కాకినాడనుంచే వచ్చింది లారీ! అందులో పసుపుకొమ్ములు వచ్చాయి. వాటి లోడింగు పూర్తి అయింది. తిరిగి తిరుపతికి వుల్లిపాయలు ఎక్కించుకు పోయింది.

మరి చింతపండు? – చింతపండు ఆ లారీ చరిత్రలోనే ఎక్కించుకోలేదుట.

పచ్చిమోసగాడు! వాట్ని నాలు గొందల యిరవైగాడు!

గుర్నాధం సొంతడబ్బుల్తో బసెక్కి గవర్నర్‌పేట చిన్నకార్ల ఆఫీసుకి వెళ్లాడు!

వాడెవ్వడో వాళ్లకి తెలియదు.... వాడు వెళ్లింది వాళ్ల ఆఫీసులోకి కాదుట.... ప్రక్కనేవున్న లెట్రిన్ వేపుట!?

"మరి యిందాకా "యివ్వనా?" అంటే యివ్వమన్నారు? "గుర్నాధం వాళ్ళని అనుమానంగా చూస్తూ అడిగాడు.

"ఏంటిమ్మన్నా మయ్యామగడా! అడెవడో వందరూపాయలకి పదులుంటే యిప్పించమన్నాడు .... ఇచ్చాం! ... ఆటోకి డబ్బులియ్యాలి కదాని జాలిపడి యిచ్చాం. ఆటోవాణ్ని,నీకాడ్నించి వంద రూపాయలకాయితం తెమ్మన్నాడు –

గుర్నాధం బుర్ర గిర్రున తిరిగిపోయింది! కాళ్ళీడ్చుకుంటూ ఆఫీసుకి తిరిగివచ్చాడు.

ప్రకాశం తన 'పేరాశకి' తగిన శిక్ష పడింది అనుకోలేదు. గుర్నాధంతో "నేను సరుకు తీసుకోకుండా పైకం యివ్వొద్దు అన్నాను కదుటయ్యా!" అని పండిపడ్డాడు.... "శుత్తవెర్రి వెంగళాయిలాగ వున్నావు!" అన్నాడు.

గుర్నాధం ప్రక్కకి తిరిగి కళ్ళు తుడుచుకున్నాడు.

ప్రకాశం శరీరంలో 'రక్తం' తోడే గుండెకాయ వుండేతప్ప అందులో హృదయం అంటారే, అటువంటి మెత్తని సున్నితమైన చోటు లేదు.

"మరోసారి చూడు....వాడికి వంద రూపాయల నోటు యిచ్చావో.... యిచ్చాను అనుకున్నావో" అన్నాడు.

గుర్నాధం గుండె. మండిపోయింది, రేపు జీతాల్లో మీ వందరూపాయలు యిచ్చేసి మిగతాదే యింటికి తీసుకు వెళ్తాను సార్" అన్నాడు కోపాన్ని అసహ్యాన్ని లోపల లోపల అణచుకొంటూ....

